క్లుప్తంగా

ముగిసిన ఇంటింటి సర్వే

బంటుమిల్లి: పదిహేను రోజులుగా మండలంలో జరుగుతున్న కుష్ఠు వ్యాధిగ్రస్తుల అనుమానితుల సర్వే శుక్రవారం ముగిసిందని బంటుమిల్లి, పెదతుమ్మిడి పీహెచ్‌సీ వైద్యాధికారులు పవన్‌కుమార్, సువర్చల తెలిపారు. గత నెల 18న ప్రారంభమైన ఇంటింటి సర్వేలో వైద్య సిబ్బంది మండలంలోని రెండు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో 44,924 మందిని పరీక్షించారు. వీరిలో 305 మందిని అనుమానితులుగా గుర్తించారు. ఈ సందర్భంగా శుక్రవారం జరిగిన ముగింపు సమావేశాల్లో డాక్టర్లు పవన్‌కుమార్, సువర్చల మాట్లాడుతూ ఇంటింటి సర్వేలో గుర్తించిన అనుమానితులకు మళ్లీ పరీక్షలు చేయాల్సి ఉంటుందన్నారు. అనంతరమే పూర్తిస్థాయిలో వ్యాధిగ్రస్తులుగా గుర్తించి మెరుగైన వైద్య పరీక్షలకు సిఫార్సు చేస్తామని తెలిపారు. సమావేశాల్లో హెల్త్ సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

విశ్రాంత వ్యాయామ మాస్టర్ పిచ్చేశ్వరరావు మృతి



రావివారిపాలెం(మోపిదేవి): వ్యాయామ ఉపాధ్యాయుడిగా సుదీర్ఘకాలం విధులు నిర్వర్తించిన రావి పిచ్చేశ్వరరావు(75) అనారోగ్యంతో గురువారం రాత్రి మరణించారు. మోపిదేవి మండలంలో వైఎస్సార్ సీపీలో కీలకంగా వ్యవహరిస్తూ పార్టీ అభివృద్ధికి ఆయన అహర్నిశలు కృషి చేశారు. ఆయన మృతిపై సమాచారం అందుకున్న అవనిగడ్డ మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు శుక్రవారం ఉదయం వారి ఇంటికెళ్లి మృతదేహాన్ని సందర్శించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట పార్టీ మండల కన్వీనర్ గరికిపాటి వెంకటేశ్వరావు, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. పిచ్చేశ్వరరావుకు భార్య విజయలక్ష్మి, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

విద్యార్థులకు పాఠ్య, నోట్ పుస్తకాల పంపిణీ

అవనిగడ్డ: ప్రభుత్వ విద్యాసంస్థల బలోపేతానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ చెప్పారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పి.రేఖారాణి, ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం జీఎన్‌బీ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

దాతల సేవలు స్ఫూర్తిదాయకం



కోడూరు: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతలు అందిస్తున్న సేవలు స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. మాచవరం గ్రామానికి చెందిన పుష్పాల నరసింహారావు, పుష్పలీలావతి జ్ఞాపకార్థం కుమారులు పుష్పాల ధనుంజయరావు (లండన్), నరేష్ (అమెరికా) గ్రామంలోని ఎంపీపీ పాఠశాల విద్యార్థులకు రూ. 35 వేలు విలువ చేస్తే నోట్ పుస్తకాలు, స్టేషనరీని అందించారు. శుక్రవారం వీటిని బుద్ధప్రసాద్ విద్యార్థులకు పంపిణీ చేశారు. ఎంఈఓ టి.వి.ఎం.రామదాసు, ఎంఈఓ–2 శ్రీనివాసరావు, సర్పంచి అప్పికట్ల లక్ష్మి, రంగస్థల కళాకారుడు పుష్పాల వీరాంజనేయులు, హెచ్‌ఎం వీరంకి బుజ్జిబాబు తదితరులు పాల్గొన్నారు.

పెడనలో నేతన్న విగ్రహం ఏర్పాటుకు చర్యలు తీసుకోండి

పెడన: పట్టణంలో నేతన్న విగ్రహం ఏర్పాటుకు అన్ని చర్యలు తీసుకోవాలని ఆలిండియా వీవర్స్ ఫెడరేషన్ కృష్ణా జిల్లా శాఖ అధ్యక్షుడు, స్వర్ణనంది అవార్డు గ్రహీత పిచ్చుక ఫణికుమార్ పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్‌ను కలిసి కోరారు. శుక్రవారం ఫణికుమార్‌తో పాటు ఫెడరేషన్ సభ్యులు బంటుమిల్లిలోని ఎమ్మెల్యే నివాసానికి చేరుకుని ఆయన్ను సన్మానించారు. ఎమ్మెల్యేను కలిసినవారిలో ఫెడరేషన్ జిల్లా ప్రధానకార్యదర్శి ఆకురాతి జనార్థన్, కోశాధికారి తాళ్ల బాలాజీ, జిల్లా కార్యవర్గసభ్యుడు బళ్ల సాంబశివరావు తదితరులున్నారు.

పంటకాల్వలో పూడికతీత పనులు

కోడూరు: మండలంలోని విశ్వనాథపల్లి నుంచి గాబకు వెళ్లే నార్త్‌చానల్ ఆరో నంబర్ పంటకాల్వలో పూడికతీత పనులను ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆదేశాలతో ఇరిగేషన్ అధికారులు కాల్వ పూడికతీతను ప్రారంభించారు. పొక్లయినర్ సాయంతో పంటకాల్వలో పేరుకుపోయిన గుర్రపుడెక్క, తూటు, మట్టి దిబ్బలను తొలగిస్తున్నారు. సాగునీటిని ప్రవాహానికి అవరోధం లేకుండా పనులు చేస్తున్నట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు. చివరి భూములకు సాగునీటిని అందించేందుకు చర్యలు తీసుకున్నట్లు అధికారులు చెప్పారు. నేతలు పనులను పరిశీలించారు.

వసతిగృహం.. సమస్యలతో సతమతం



స్వతంత్రపురంలో పెచ్చులూడుతున్న బీసీ హాస్టల్ శ్లాబ్

- కోడూరు స్వతంత్రపురంలో బీసీ బాలుర హాస్టల్
- శిథిలావస్థకు..
- కిటికీలకు రెక్కలు లేవు
- గణనీయంగా తగ్గిన విద్యార్థుల సంఖ్య

కోడూరు: మండలంలోని స్వతంత్రపురంలో బీసీ బాలుర వసతిగృహం సమస్యలతో సతమతమవుతోంది. శిథిలావస్థకు చేరిన హాస్టల్ భవనం, కిటికీలకు రెక్కలు కూడా లేని పరిస్థితి.. ఉన్నా ఉపయోగపడని మరుగుదొడ్లు.. దోమల బెడద.. ఇది కోడూరులోని బీసీ బాలుర వసతి గృహం దుస్థితి. 1986వ సంవత్సరంలో వెనుకబడిన తరగతుల విద్యార్థుల కోసం స్వతంత్రపురంలో వసతిగృహాన్ని నిర్మించారు. సుమారు రెండెకరాల విస్తీర్ణంలో హాస్టల్ ఉంది. విద్యార్థుల కోసం 13 గదులను అందుబాటులోకి తెచ్చారు. వీటితో పాటు వంటగది, ఆఫీసు రూమ్‌లను కూడా నిర్మించారు. కాలక్రమంలో వసతి గృహం శిథిలావస్థకు చేరి, హాస్టల్ పైభాగంలోని శ్లాబ్ నుంచి పెచ్చులు ఊడి పడుతున్నాయి. సుమారు ఏడేళ్ల నుంచి పరిస్థితి ఇలాగే ఉంది.



ముళ్లకంపల మధ్య నిరుపయోగంగా మరుగుదొడ్లు



శిథిలావస్థకు బాలుర బీసీ వసతిగృహం

శ్లాబులు కూల్చివేత

వసతి గృహం ప్రమాదకరంగా మారడంతో సుమారు పది గదులకు సంబంధించి శ్లాబ్‌ను గతంలో కూల్చివేశారు. నూతన వసతి గృహానికి నిధులు మంజూరు చేస్తామని అధికారులు చెప్పడంతో కాంట్రాక్టర్ ఈ శ్లాబులను కూల్చివేశాడు. అయితే శ్లాబ్ కూల్చడం ద్వారా వచ్చిన ఆదాయాన్ని కాంట్రాక్టర్ హాస్టల్ అభివృద్ధికి కేటాయించలేదు. నగదును ప్రభుత్వానికి కూడా జమ చేయలేదు. దీనిపై సంబంధిత అధికారులు విచారణ కూడా నిర్వహించారు.

వసతుల కరువు

ప్రస్తుతం హాస్టల్‌లో 45మంది విద్యార్థులు ఆశ్రయం పొందుతున్నారు. వీరిలో ఏడుగురు విద్యార్థులు పదో తరగతి చదువుతున్నారు. ఇక్కడ వసతులు పూర్తిగా కరువయ్యాయి. 45 మంది విద్యార్థులు కేవలం రెండు గదుల్లో ఉండాల్సిన దుస్థితి నెలకొంది. గదుల్లో ఇరుక్కుని పడుకోవడంతో పాటు అందరికీ సరిపడా మంచాలు ఉన్నా వినియోగించుకోలేని పరిస్థితి. ఈ రెండు గదుల్లోని కిటికీలకు రెక్కలు ఊడిపోయాయి. రాత్రి వేళల్లో దోమల బెడద అధికంగా ఉందని విద్యార్థులు వాపోతున్నారు. హాస్టల్‌కు ఆమాడదూరంలో మరుగుదొడ్లను నిర్మించడంతో నిరుపయోగంగా మారాయి.

విద్యార్థులను చేర్పించడానికి వెనకడుగు

వసతి గృహం శిథిలావస్థకు చేరడంతో తల్లిదండ్రులు తమ పిల్లలను ఇక్కడ చేర్పేందుకు వెనకడుగు వేస్తున్నారు. కేవలం రెండు గదుల్లో మాత్రమే పిల్లలను ఉంచడంతో అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో హాస్టల్‌లో 200మంది విద్యార్థులు ఆశ్రయం పొందేవారని, కానీ నేడు గణనీయంగా తగ్గారని గ్రామస్తులు బాహాటంగానే చెబుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి వసతి గృహం నిర్వహణకు నూతన భవనాలు నిర్మించాలని తల్లిదండ్రులు, విద్యార్థులు కోరుతున్నారు.

ఇరుకు గదుల్లో ఉంటున్నాం



విద్యార్థులందరినీ రెండు గదుల్లో ఉంచారు. 45మంది విద్యార్థులు వాటిలో ఉండాలంటే చాలా ఇరుకుగా ఉంది. కిటికీలకు రెక్కలు లేకపోవడంతో రాత్రి వేళ దోమల బెడద అధికంగా ఉంది. మరుగుదొడ్లు కూడా హాస్టల్‌కు దూరంగా ఉండడంతో వాటిని వినియోగించుకోలేకపోతున్నాం. భవనం పైభాగం పెచ్చులూడటంతో భయంగా ఉంది.

– కొప్పనాతి వినయ్, విద్యార్థి, దింటిమెరక

రూ.60 లక్షల నిధులు మంజూరు



బీసీ బాలుర వసతి గృహం శిథిలావస్థకు చేరింది. ప్రస్తుతం హాస్టల్‌లో రెండు గదులు బాగుండటంతో వాటిలో విద్యార్థులను ఉంచాం. హాస్టల్ పరిస్థితిని ఉన్నతాధికారులకు దృష్టికి తీసుకువెళ్లాం. ఈ నెల 17న హాస్టల్ నిర్మాణానికి రూ.60 లక్షల నిధులు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. త్వరలోనే పనులు కూడా ప్రారంభిస్తారు. హాస్టల్‌లో విద్యార్థుల సంరక్షణకు పెద్దపీట వేస్తున్నాం.

– ఎస్.సురేష్, ఇన్‌చార్జ్ వార్డెన్, కోడూరు

సాగునీటికి ఎదురుచూపులు

బంటుమిల్లి: మండలంలో సాగునీటి కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. కాల్వలకు సాగునీటి విడుదల తగ్గిపోవడంతో శివారు భూములకు నీరందని పరిస్థితి. దీంతో వెదజల్లిన పొలాలు నీటి ఎద్దడికి గురవుతున్నాయి. కొంతమంది రైతులు కాల్వల్లో అడుగంటిన నీటిని ఇంజిన్ల పెట్టి తోడుకుంటూ పంటను కాపాడుకునే యత్నంలో ఉన్నారు. ముంజులూరు, కంచడం, బర్రిపాడు గ్రామాల్లో నీటి ఎద్దడి కారణంగా వరినాట్లు మందకొడిగా సాగుతున్నాయి. నాగేశ్వరరావుపేట, పెందుర్రు, ఆముదాలపల్లి తదితర పంచాయతీల పరిధిలో వెదజల్లిన పొలాలు నీటి కోసం ఎదురుచూస్తున్నాయి. దీనిపై నీటిపారుదల శాఖ ఏఈ నాగేశ్వరరావు మాట్లాడుతూ బంటుమిల్లి కాల్వకు 551 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారని, కృత్తివెన్ను మండలం శివారుకు నీరు చేరిన అనంతరం బ్రాంచ్ కాల్వల్లో షట్టర్లు పైకి లేపుతామని తెలిపారు. పులిచింతల దిగువ ప్రాంతంలో నీరు అందుబాటులో లేకపోవడంతో పట్టిసీమ నుంచే నీరొస్తుందని పేర్కొన్నారు.



ఆముదాలపల్లిలో నీరు లేక.. వెదజల్లిన పొలం ఇలా

తల్లిపాలు అమృతంతో సమానం



చినపాండ్రాకలో మాట్లాడుతున్న సీడీపీవో సముద్రవేణి



మెరకనపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవం

కృత్తివెన్ను: తల్లిపాలు అమృతంతో సమానమని పుట్టిన గంటలోపలే తల్లిపాలను బిడ్డకు పట్టించాలని ఐసీడీఎస్ సీడీపీవో సముద్రవేణి అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం చినపాండ్రాక బీసీ అంగన్‌వాడీ కేంద్రంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిడ్డకు రెండేళ్లు వచ్చే వరకు మెదడు 90% అభివృద్ధి చెందుతుందని, బిడ్డపుట్టిన ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలను మాత్రమే ఆహారంగా ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ శ్యామలగౌరి, ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

- బంటుమిల్లి కొత్త దళితవాడలో శుక్రవారం నిర్వహించిన తల్లిపాల వారోత్సవాలు కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీవో సముద్రవేణి సిబ్బంది పాల్గొన్నారు.

మెరకనపల్లి(మోపిదేవి): బిడ్డ పుట్టిన వెంటనే తల్లిపాలు పట్టించాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులు సూచించారు. మండలంలోని మెరకనపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు శుక్రవారం నిర్వహించారు. హెల్త్ సూపర్‌వైజర్లు జె.షరోన్, హెల్త్ ఆఫీసర్ బి.బేబి అంజలి, ఏఎన్‌ఎం వి.సంపూర్ణ, ఆశా వర్కర్ కె. రాణి, అంగన్‌వాడీ టీచర్ ఎం.సుజాత తదితరులు పాల్గొన్నారు.

గూడూరు: తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మండలంలోని రాయవరంలో గర్భిణులు, బాలింతలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ మల్లవోలు సెక్టారు సూపర్‌వైజర్ జన్ను రేవతి తల్లిపాల ప్రాముఖ్యత గురించి వివరించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ శ్రావణి, అంగన్‌వాడీ కార్యకర్తలు చిత్రాల రత్నమాణిక్యం, ఏఎన్‌ఎం భార్గవి, తదితరులు పాల్గొన్నారు.

లంకపల్లి(ఘంటసాల): మండలంలోని లంకపల్లి, గోటకం, చినకళ్లేపల్లి అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాలను శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలోఐసీడీఎస్ సూపర్‌వైజర్లు డి.మేరీ, టి.రమా నాగమణి అంగన్‌వాడీ కార్యకర్త కె.ఇందిర తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణతో మాదిగల జీవితాల్లో వెలుగులు



పెద్దగూడెంలో జరిగిన విజయోత్సవంలో పెద్దలు, యువకులు

ఘంటసాల: ఎస్సీ వర్గీకరణతోనే మాదిగల జీవితాల్లో వెలుగులు వస్తాయని పలువురు వక్తలు అన్నారు. మండల కేంద్రమైన ఘంటసాల పెద్దగూడెంలో అమ్మనాన్న ట్రస్టు అధ్యక్షులు కొడాలి భక్తపాల్, దిరిశం పిచ్చేశ్వరరావు, ఉపాధ్యాయులు, ఉద్యోగస్తులు, పెద్దగూడెం యూత్ ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణ అనుకూలంగా సుప్రీం కోర్టు తీర్పును స్వాగతిస్తూ విజయోత్సవ కార్యక్రమాన్ని శుక్రవారం చేశారు. ఈ సందర్భంగా పెద్దగూడెంలోని మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహానికి గ్రామ పెద్దలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మాదిగ రిజర్వేషన్ పోరాట వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. పలువురు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు మద్దతు తెలిపిన పార్టీలు త్వరగా వర్గీకరణ చేసి విశ్వసనీయతను నిరూపించుకోవాలన్నారు. కార్యక్రమంలో దిరిశం బాలకోటయ్య, నందేటి శ్రీనివాసరావు, దిరిశం రవి బాబు, పాల సోమేశ్వరరావు, కొడాలి గంగాధరరావు, వార్డు సభ్యుడు దిరిశం సుధీర్, కొడాలి సముయేలు, దిరిశం సుధీర్, కొడాలి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

పింగళి ప్రతి ఒక్కరికీ ఆదర్శం



అవనిగడ్డలో పింగళికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు



పింగళి వెంకయ్య విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

అవనిగడ్డ: జాతీయ పతాక రూపశిల్పి పింగళి వెంకయ్య ప్రతి ఒక్కరికీ ఆదర్శమని మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు చెప్పారు. పింగళి జయంతి కార్యక్రమాన్ని స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. రమేష్‌బాబు పింగళి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సింహాద్రి మాట్లాడుతూ జాతీయ పతాక రూపకల్పన ద్వారా తెలుగువారికి పింగళి కీర్తి ప్రతిష్టలు తీసుకొచ్చారని కొనియాడారు. ఆయన్ను స్ఫూర్తిగా తీసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, పార్టీ మండల అధ్యక్షుడు రేపల్లె శ్రీనివాసరావు, పార్టీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి గాజుల జయగోపాల్, మండల కోఆప్షన్ సభ్యులు షేక్‌నజీర్‌బాషా, మాజీ సర్పంచ్ సైకం బాబూరావు, రాముడు తదితరులు పాల్గొన్నారు.

మచిలీపట్నంటౌన్: స్థానిక వర్రెగూడెంలోని అజ్మీర్ బాబా సేవా సమాజం ఆధ్వర్యంలో పింగళి వెంకయ్య జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. వెంకయ్య చిత్రపటానికి హోమియో వైద్యుడు శ్రీనివాస్, వైజ్‌మెన్ క్లబ్ అధ్యక్షుడు సయ్యద్‌పీర్ తదితరులు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు సయ్యద్‌బాజీ, అమన్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

పెడన: పింగళి వెంకయ్య జయంతి వేడుకలను శుక్రవారం పెడనలోని మహాత్మాగాంధీ మున్సిపల్ కాంప్లెక్స్ వద్ద ఘనంగా నిర్వహించారు. ఎన్డీఏ కూటమి నాయకులు తొలుత మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు, కాంప్లెక్స్ ఆవరణలోని మహాత్మగాంధీ విగ్రహాలకు పూలమాలలు వేశారు. కార్యక్రమంలో జనసేన నాయకుడు దాసరి సత్యనారాయణ, కౌన్సిలర్ శివపావని, నేతలు వాహెబ్‌ఖాన్, ఇబ్రాయెల్ తదితరులు పాల్గొన్నారు.

అవనిగడ్డ: పింగళి వెంకయ్య తెలుగువారు కావడం మనందరికీ గర్వకారణమని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. స్థానిక గాంధీక్షేత్రంలో పింగళి వెంకయ్య జయంతి కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పింగళి విగ్రహానికి బుద్ధప్రసాద్ పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ మండవ బాలవర్ధిరావు, రంగస్థల కళాకారుడు పుష్పాల వీరాంజనేయులు, భావదేవరపల్లి సర్పంచ్ మండలి ఉదయ భాస్కర్, పలువురు నేతలు పాల్గొన్నారు.

అమ్మవారికి ఆషాఢసారె సమర్పణ



శ్రీరాజరాజేశ్వరి అమ్మవారికి సారెను అందజేస్తున్న మహిళలు



శాకంబరీదేవిగా పార్వతీదేవి

మచిలీపట్నంటౌన్: నగరంలో రాబర్ట్‌సన్‌పేటలోని శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో కొలువైన శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారికి భక్తులు శుక్రవారం ఆషాఢమాస సారెను అందజేశారు. శాకంబరీదేవి అలంకారంలో దర్శనమిచ్చిన అమ్మవారికి భక్తులు పూజలు చేశారు. ఆలయ ధర్మకర్తల మండలి మాజీ చైర్మన్ దేసు వెంకటసుబ్రహ్మణ్యేశ్వరరావు గృహం నుంచి ఆలయం వరకు మహిళా భక్తులు పూలు, పండ్లు, స్వీట్లు, పసుపు, కుంకుమ, నూతన వస్త్రాలను ఊరేగింపుగా ఆలయం వరకు తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించారు. ఆలయ ప్రాంగణంలోని 35 అడుగుల ధ్యాన ముద్రలో ఉన్న శివుని విగ్రహం వద్ద సారెను ప్రదర్శించారు. కార్యక్రమంలో దేవదాయ ధర్మదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ సంధ్య, మచిలీపట్నం డివిజన్‌లోని ఆలయాల తనిఖీ అధికారి ఖగ్గా శ్రీనివాసరావు, ఈఓ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శాకంబరీదేవిగా దర్శనమిచ్చిన శ్రీ దుర్గా, పార్వతీ అమ్మవార్లు

పెదకళ్లేపల్లి(మోపిదేవి): పెదకళ్లేపల్లిలోని శ్రీ దుర్గా, పార్వతీ సమేత నాగేశ్వరస్వామివారి దేవస్థానంలో ఆషాఢ మాసం సందర్భంగా అమ్మవార్లను వివిధ రకాల కూరగాయలు, పండ్లతో శాకంబరీ దేవిగా అలంకరించారు. ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరరావు ఆధ్వర్యంలో ప్రధానార్చకుడు బుద్ధు విజయ్‌కుమార్ శర్మ బ్రహ్మత్వంలో ఉదయం ప్రత్యేక పూజలు, అభిషేకం నిర్వహించారు. అనంతరం మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి దేవస్థానం ఘనాపాటి నౌడూరి విశ్వనాథ సుబ్రహ్మణ్యశర్మ, విజయవాడకు చెందిన నేచురల్ ఫ్రూట్స్ షాపు అధినేత బొర్రా సుధీర్ ఆర్థిక సహకారంతో కూరగాయలు, పండ్లతో ఆలయ ప్రాంగణం, శ్రీ దుర్గా, పార్వతీ అమ్మవార్లను శాకాంబరీదేవిగా అలంకరించారు.

పెడన: పట్టణంలోని కొత్తపేట మహిళలు శుక్రవారం ఉదయం ఒకటో వార్డు విజయ గణపతి ఆలయం నుంచి ఊరేగింపుగా గ్రామదేవత పైడమ్మ ఆలయానికి చేరుకుని సారె సమర్పించారు.

అవనిగడ్డ: స్థానిక లక్ష్మీనారాయణస్వామి ఆలయ ప్రాంగణంలో వేంచేసియున్న భువనేశ్వరి అమ్మవారు భక్తులకు శాకంబరీదేవిగా దర్శనమిచ్చారు. 30కిలోల పలు రకాల కూరగాయలతో అమ్మవారికి ప్రత్యేక అలంకారం చేశారు. కార్యక్రమాన్ని ఈవో యార్లగడ్డ శ్రీనివాసరావు, ధర్మకర్త పోతురాజు భాస్కరరావు పర్యవేక్షించారు.

పెదకళ్లేపల్లి(మోపిదేవి): పెదకళ్లేపల్లిలో దుర్గా, పార్వతీ సమేత నాగేశ్వరస్వామికి శుక్రవారం ఆషాఢ సారె సమర్పించారు. మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానం నుంచి ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరావు ఆధ్వర్యాన ప్రధానార్చకుడు బుద్ధు పవన్‌కుమార్ శర్మ బ్రహ్మత్వంలో ఉదయం ఆషాఢ సారెను ప్రత్యేక వాహనంపై తరలించారు. సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణ, ఘనాపాటి నౌడూరి విశ్వనాథ సుబ్రహ్మణ్యశర్మ తదితరులు పాల్గొన్నారు.

శిక్షణను వినియోగించుకోండి



కోనేరుసెంటర్: హస్త కళాకారులను ప్రోత్సహించి ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని, శిక్షణను వినియోగించుకోవాలి డెవలప్మెంట్ హ్యాండీక్రాఫ్ట్ అసిస్టెంట్ డైరెక్టర్ అపర్ణ లక్ష్మి తెలిపారు. బందరు మండలం చిన్నాపురం గ్రామంలో ఏపీ హ్యాండీక్రాఫ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో హస్తకళలపై నెలరోజుల పాటు నిర్వహించిన శిక్షణ తరగతులు శుక్రవారంతో ముగిశాయి. శిక్షణలో పాల్గొన్న కళాకారులకు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా అపర్ణ మాట్లాడుతూ శిక్షణ పొందిన కళాకారులు తాము తయారు చేసే ఉత్పత్తులను విక్రయించేందుకు లేపాక్షి హ్యాండీక్రాఫ్ట్ అభివృద్ధి సంస్థ ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి సహకరిస్తుందన్నారు. లేపాక్షి మేనేజర్ సురేష్ మాట్లాడుతూ నెలరోజులపాటు నిర్వహించిన శిక్షణ తరగతులను కళాకారులు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హ్యాండీక్రాఫ్ట్ ప్రమోషన్ ఆఫీసర్ సువర్చల, లేపాక్షి అకౌంటెంట్ ఉమామహేశ్వరరావు, శిక్షణ నిర్వాహకుడు వంశీ, అశ్విని కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటండి.. పర్యావరణాన్ని కాపాడండి



కోడూరు: ప్రతి ఒకరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని ఎస్ఐ శిరీష పిలుపునిచ్చారు. ఉల్లిపాలెం ఎంపీయూపీ ఉపాధ్యాయుడు కాశీభొట్ల నాగభూషణం ప్రారంభించిన వంద రోజుల మొక్కల నాటే కార్యక్రమంలో ఎస్ఐ పాల్గొన్నారు. విద్యార్థులు తమ ఇళ్ల వద్ద మొక్కలు నాటేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. రహదారి వెంట, పంటపొలాల వద్ద మొక్కలరె నరకకుండా వాటిని పరిరక్షించడానికి నడుంబిగించాలన్నారు. వందరోజుల పాటు మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించి, నిర్విరామంగా నిర్వహిస్తున్న నాగభూషణాన్ని అభినందించారు. అనంతరం కోడూరు–అవనిగడ్డ ప్రధాన రహదారిలో మొక్కలను నాటారు. ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.